క్లుప్తంగా

నేడు మెగా రక్తదాన శిబిరం

హుకుంపేట: కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రం హుకుంపేటలో ఎంపీడీవో కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.

గిరిజన మహిళలకు ఉద్యోగ అవకాశాలు

మారేడుమిల్లి : ఏఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం ద్వారా ప్రశాంతి ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ సహకారంతో టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిడెడ్ కంపెనీలో గిరిజన మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు మారేడుమిల్లి సీఐ రుద్రరాజు భీమరాజు మంగళవారం తెలిపారు. ఏడు మండలాల్లోని 3,000 మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇంటర్మీడియెట్ చదివిన 18 నుంచి 30 సంవత్సరాల లోపు మహిళలు అర్హులని, ఆసక్తి గల వారు ఈ నెల 8వ తేదీ లోపు వారి పరిధిలోని మహిళా పోలీసు వద్ద గాని, సమీప పోలీస్ స్టేషన్‌లో గాని తమ పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. 10వ తేదీన రంపచోడవరంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎంపికైన వారందరికీ ఆ కంపెనీలో ఉద్యోగాలు ఇవ్వనున్నట్టు తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై విస్తృత ప్రచారం



పీహెచ్‌సీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వై.రామవరం: జగనన్న ఆరోగ్య సురక్షపై విస్తృతంగా ప్రచారం చేసి, అందరూ వైద్య సేవలు పొందేలా పీహెచ్‌సీ సిబ్బంది కృషి చేయాలని మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌లు తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బందికి మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రిలో సుఖ ప్రసవాలు చేయించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

డీటీఎఫ్ సభలను విజయవంతం చేయండి



రజతోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

డుంబ్రిగుడ: విశాఖపట్నం దాబాగార్డెన్స్‌లో ఈ నెల 10,11 తేదీల్లో నిర్వహించనున్న డీటీఎఫ్ రజతోత్సవ సభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ నాయకులు కోరారు. సభల పోస్టర్‌ను మంగళవారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక సంఖ్యలో సభలకు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుందర్‌రావు, జిల్లా కార్యదర్శి వికాస్, డీటీఎఫ్ నాయకులు జలంధర్,సింహాచలం, రామచందర్‌రావు, లింగందొర పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశువుకు వ్యాధినిరోధక టీకా వేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు గ్రామంలో 583 పశువులకు మంగళవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రాజశ్రీ మాట్లాడుతూ పశువులకు వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారావు, అనురాధ, త్రినాథరావు, సంజీవరావు, అప్పారావు, మనోజ్, రమేష్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష గిరిజనులకు రక్ష



గంగవరంలో ఓపీ నమోదు చేస్తున్న సిబ్బంది



వంచంగిలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కాంతం

హుకుంపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద గిరిజనులకు రక్షగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ సమన్వయ కర్త, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని శోభకోట పంచాయతీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ 220 మందికి వైద్య సేవలు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, సీదరి సాంబ, నాయకులు చిన్నారావు, శ్రీను తదితర పాల్గొన్నారు.

228 మందికి వైద్య సేవలు

గంగవరం : స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 228 మందికి వైద్య సేవలందించినట్టు వైద్యాధికారి భావన తెలిపారు. గంగవరం సచివాలయం పరిధిలో ఆముదాలబంద, గంగవరం గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలకు వైద్యసేవలందించినట్టు చెప్పారు. డాక్టర్లు శ్వేత, దుర్గాప్రసాద్, ఆదిలక్ష్మి, 104 సిబ్బంది గంగవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది సేవలందించారు.

వంచంగిలో..

రాజవొమ్మంగి : మండలంలోని వంచంగిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ కూండ్రు కాంతం ప్రారంభించారు. ఈ శిబిరంలో 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్టు హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ తెలిపారు. వైద్య నిపుణులు డాక్టర్ జీవన్, జడ్డంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జి.ఎస్.వి.నాగార్జున, నానాజీ, హెచ్‌వీ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్లు రాజుబాబు, పద్దరాజు, ఎంఎల్‌హెచ్‌పీలు కుమారి, సరస్వతి, లక్ష్మి, భవాని, మురళి, 104 డీఈవో శ్రీనివాస్, పైలెట్ శివ, సచివాలయ సెక్రటరీ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్ కూండ్రు అర్జున్ పర్యవేక్షించారు.

తహసీల్దార్లు, ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ



చింతూరు తహసీల్దార్ నజీముల్లాషా



కొయ్యూరు తహసీల్దారు రాజేశ్వరరావు



బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో రంగారావు

చింతూరు: ఏలూరు కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎండీ.నజీముల్లాషా ఆయన ఇటీవల జరిగిన జరిగిన బదిలీల్లో భాగంగా చింతూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఎర్రంపేటలోని ఎంపీపీఎస్, చింతూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చట్టిలోని ఎంపీపీఎస్ పాఠశాలల్లో పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. మౌలిక సౌకర్యాలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దారయ్య, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, వీఆర్వో రామచంద్రం పాల్గొన్నారు.

అడ్డతీగల ఎంపీడీవోగా రంగారావు

అడ్డతీగల: స్థానిక ఎంపీడీవోగా ఎ.రంగారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకూ రాజవొమ్మంగి ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.బాపన్నదొరను రెగ్యులర్ పోస్టింగ్‌పై ఎటపాకకు వెళ్లారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా సమర్థంగా సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని రంగారావు ఈ సందర్భంగా చెప్పారు.

అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసచివాలయాల సిబ్బందితో సమావేశమై సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు.



వై.రామవరం ఎంపీడీవో రవికిషోర్

వై.రామవరం ఎంపీడీవోగా రవికిషోర్

వై.రామవరం: స్థానిక ఎంపీడీవోగా మంగళవారం రవికిషోర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన కడప నుంచి బదిలీపై వచ్చారు. అనంతరం వెలుగు, ఉపాధి హామీ, సచివాలయాల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలసి పనిచేసి, మండల అభివృద్ధికి కృషి చేద్దామని తెలిపారు.

కొయ్యూరు తహసీల్దార్‌గా రాజేశ్వరరావు

కొయ్యూరు: స్థానిక తహసీల్దారుగా డి.రాజేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ సీతారాం, రీ సర్వే డీటీ దుమంతి సత్యనారాయణ, ఆర్ఐ, వీఆర్వోలు, వీఆర్ఏలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు.

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాల కల్పనకు చర్యలు



రంపచోడవరంలో వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ కృష్ణజ్యోతి



జడేరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ



రాజవొమ్మంగిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

రంపచోడవరం: మండలంలోని పోలింగ్ బూత్‌ల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు రంపచోడవరం తహసీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. మండలంలోని 13 పోలింగ్ బూత్‌లను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పోలింగ్ బూత్‌ల పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇస్తున్నట్లు తెలిపారు.తహసీల్దార్ వెంట సీనియర్ అసిస్టెంట్లు ఇందిరాబాయ్, చెల్లాయమ్మ, టి.లక్ష్మణ్, ఆర్ఐ ఎన్.విగ్నేష్, వీఆర్వో ఉన్నారు.

గంగవరం : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్టు తహసీల్దార్ ఎం.శ్రీమన్నారాయణ తెలిపారు. పెదఅడ్డపల్లి, జడేరు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలల్లో గుర్తించిన సమస్యలను కలెక్టర్, సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పారు.

ఈ పర్యటనలో భాగంగా జడేరు ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట వీఆర్వో వెంకన్నదొర ఉన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను స్థానిక తహసీల్దార్ డి.వి.సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. అమ్మిరేఖల, బడదనాంపల్లి, రాజవొమ్మంగి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. ఆయన వెంట సెక్టోరల్ ఆఫీసర్లు సూరయ్య రెడ్డి, తాతబ్బాయిదొర, బీఎల్వోలు సూర్యాకాతం తదితరులున్నారు.

భూములకు భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీపీ రంజపల్లి ఉషారాణి



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ జ్యోతి

అరకులోయ రూరల్: భూములకు భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. మండలంలోని మాడగడ పంచాయతీ బొడుగుడలో 55మంది రైతులకు రీ సర్వే పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు పథకం వల్ల రైతులకు మేలు జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాలరాజు, నర్సింగ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

రాజవొమ్మంగి : ఆన్‌లైన్ మోసాలపై స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు సీఐ సన్యాసినాయుడు మంగళవారం అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌లపై వివరించారు. అడిషనల్ ఎస్ఐ జాన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చింతపల్లిరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో వీరసాయిబాబు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

చిన్నారుల నుంచి రక్త పూతల సేకరణ



రాజవొమ్మంగిలో రక్తపూతలు సేకరిస్తున్న వైద్య ఆరోగ్యసిబ్బంది

రాజవొమ్మంగి : మండలకేంద్రం రాజవొమ్మంగిలోని పలు వీధిల్లో సోమవారం రాత్రి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఫైలేరియా నిర్ధారణకు రక్త పూతలు సేకరించారు. 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు 5 నుంచి 9 సంవత్సరాలలోపు వయసు గల 50 మంది పిల్లల రక్తనమూనాలు సేకరించారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మా, సీహెచ్‌వో పి.పద్మావతి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్, ఎంటీఎస్ పి.సోమరాజు, హెచ్‌వీలు రమాబాయి, లక్ష్మమ్మ, నానిబాబు తదితరులు స్థానిక బీసీ కాలనీ, గాంధీబొమ్మ సెంటర్, శివాలయంవీధి, ఎస్సీ కాలనీలలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

దోమ కుట్టరాదు, పుట్ట రాదు అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. దోమ తెరల వాడకం తప్పని సరి అని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పలు వ్యాధులను దూరం చేసుకోవచ్చని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు చీడపల్లి శాంతకుమారి పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

ముంచంగిపుట్టు: ఆశా కార్యకర్తలు నిత్యం అప్రమత్తంగా ఉంటూ సకాలంలో వైద్య సేవలందించడంతో పాటు గ్రామాల్లో ప్రబలే వ్యాధుల గురించి వైద్యులకు తెలియజేయాలని కిలగాడ వైద్యాధికారులు ఎస్.రమేష్,శిరీష తెలిపారు. సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలతో కిలగాడ పీహెచ్‌సీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా వ్యాధుల పరిస్థితిపై ఆరా తీశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రసవ తేదీకి ముందుగా ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం,కిలగాడ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండరెడ్ల గ్రామంలో వైద్యశిబిరం



గ్రామస్తులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న వైద్యాధికారి విశ్వచైతన్య

చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీ పరిధిలోగల కొండరెడ్డి గ్రామమైన మామిళ్లబండలో వైద్యాధికారి విశ్వచైతన్య ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు అధిక కాన్పులు అయిన మహిళలకు కుటుంబ సంక్షేమ ఆపరేషన్ల గురించి అవగాహన కల్పించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. 25 మందికి రక్తనమూనాలు సేకరించి ఉచితంగా మందులు అందచేశారు. గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడికి క్వాషియోర్కర్ వ్యాధి సమస్య ఉండడంతో చింతూరు ఏరియా ఆస్పత్రిలోని ఎన్ఆర్‌సీ కేంద్రానికి రిఫర్ చేసినట్లు వైద్యాధికారి విశ్వచైతన్య తెలిపారు. వైద్యసిబ్బంది వనజకుమారి, శాంతి, కోటేశ్వరరావు, సంజీవరావు, విజయ్, స్వరూప, లలిత, కవిత పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వాసు

పాడేరు : రోడ్డు ప్రమాదాల నివారణ మన చేతుల్లోనే ఉందని, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని రవాణా శాఖ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వాసు తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా సహాయ పడాలి అనే విషయాన్ని తెలియజేశారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. జిల్లా ఆస్పత్రి వైద్యుడు బి.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయ్, వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్. రసూల్, అధ్యాపకులు కోటేశ్వరరావు, శంకర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు గౌరీశంకర్, రమేష్‌కుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బాలరాజు

గంగవరం : మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని మోహనాపురం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎం.బాలరాజు అన్నారు. మంగళవారం నీలవరం గిరిజన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో రికార్డులను, మధ్యాహ్నభోజన అమలను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



రాజవొమ్మంగి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు

రాజవొమ్మంగి : జగనన్న విద్యాకానుకలో భాగంగా ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థినీవిద్యార్థులకు అందజేస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి తెలిపారు. మంగళవారం వారు స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 103 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈ ట్యాబ్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. హెచ్ఎం గోపాలకృష్ణ, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వీరబాబు, మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు పాల్గొన్నారు.

చిన్నేరు కల్వర్టు మరమ్మతు పనులు ప్రారంభం



చిన్నేరుపై కల్వర్టుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: నెల్లిమెట్ల వద్ద చిన్నేరుపై గల కల్వర్టు మరమ్మతు పనులను మంగళవారం ప్రారంభించారు. మండలంలోని లబ్బర్తి తదితర 15 గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై నెల్లిమెట్ల వద్ద గల కల్వర్టు శిథిలమైన సంగతి తెలిసిందే. దీంతో ఈ సమస్యను ఇటీవల ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి పరిసర గ్రామ ప్రజలకు సహకరించాలని ఆ ప్రాంతంలో ఎన్‌హెచ్ 516ఈ పనులను చేపడుతున్న సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ సూచించారు. ఈమేరకు పనులు చేపట్టారు. ఈ పనులను లబ్బర్తి లాగరాయి సర్పంచ్‌లు గణలక్ష్మి, సత్యవతి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు నీలం అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

హుకుంపేట: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, పలు గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీపీ కూడా రాజుబాబు తెలిపారు. మండలంలోని తడిగిరి పంచాయతీ ఒంటిపుట్టు, తీగలవలస పంచాయతీ కరకపుట్టు గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ రోడ్లను రూ.7లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు, తాగునీటి పథకాల పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, ఎంపీటీసీలు కొర్ర నాగరాజు, పరదాని భీమలింగేశ్వరరావు, సర్పంచ్ పాంగి బేసు, జేఈ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వైకేఎస్ జిల్లా అడ్వైజరీ కమిటీ మెంబర్‌కు సన్మానం



ధర్మరాజును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అరకులోయ రూరల్: నెహ్రూ యువకేంద్ర సంఘటన్ (ఎన్‌వైకేఎస్) జిల్లా అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమితులైన బిసాయి ధర్మరాజును అరకులోయలో బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు స్వాభి రాంచందర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సన్మానించి, అభినందించారు.

ఆధార్ కేంద్రం కోసం వినతి

ముంచంగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయతీ జోడిగుమ్మ గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని ఆ గ్రామ గిరిజనులు కోరారు. ఈ సమస్యను ఎంపీడీవో కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా జోడిగుమ్మతో పాటు అన్ని గ్రామాల్లో ఆధార్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో సోమవారం ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్‌పోస్టర్లను యూటీఎఫ్ నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మొశ్యా ధర్మారావు, యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు రాజు, గోపి, గౌరవ అధ్యక్షుడు అప్పలనాయుడు, కోశాధికారి శ్రీనివాసమూర్తి, పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కంప్యూటర్ సదుపాయం

పెదబయలు: స్థానిక గ్రంథాలయానికి కలెక్టర్ కంప్యూటర్ సదుపాయం కల్పించినట్టు గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రింటర్, కంప్యూటర్‌ను అధికారులు మంగళవారం అందజేశారని చెప్పారు. నూతన గ్రంథాలయం భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు.